తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# ఆక్రమణలో కారూరు చెరువు

**- డికేటి పట్టాలు రిజిస్ట్రేషన్లు**
**- తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన కారూరు గ్రామస్తులు**

ఓజిలి, డిసెంబర్ 16 ప్రభాతవార్త : ఓజిలి మండలం అత్తివరం గ్రామపంచాయతీ పరిధిలోని కారూరు గ్రామం చెరువు ఆక్రమణకు గురైందని, డీకేటి పట్టా భూములు దర్జాగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని కారూరు గ్రామానికి చెందిన వీరి బోయిన సుధాకర్ తాసిల్దార్ కి కర్ర బల్లవోలులో జరుగుతున్న రెవెన్యూ సరస్సులో సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు మాట్లాడుతూ కారూరు గ్రామ చెరువును కొందరు ఆక్రమణదారులు సుమారు ఐదు ఎకరాల నుంచి పది ఎకరాల దాకా ఆక్రమించి ఉంటున్నారని, ఇంకా డికెటి పట్టా భూములను లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి లక్షల నుంచి కోట్లాది రూపాయలకు రిజిస్ట్రేషన్లు చేయించు కుంటున్నారని



తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

అన్నారు. సాగు నీరు అందించే చెరువును ఇదే అదురుగా ఇంకొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తాసిల్దార్‌కి విన్నవించినట్లు తెలిపారు. వెంటనే ఆక్రమణలు ఆపకపోతే కారూరు గ్రామ చెరువు అన్యాక్రాంతం అవుతాదని తాసిల్దారు కు విన్నవించారు. అంతకు ముందు చెరువు ఆక్రములను, డీకేటి పట్టాల రిజిస్ట్రేషన్‌లను వెంటనే ఆపేయాలని మండల కేంద్రమైన ఓజిలి తాసిల్దార్ కార్యాలయంలో ఆయన డిప్యూటీ తాసిల్దారును కోరారు. ఫిర్యాదుకు స్పందిస్తూ ఆక్రమణలు చట్ట విరుద్ధమని, ప్రభుత్వ భూములు రిజిస్ట్రేషన్ చేయరని, అలా చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# అపోహలు తొలిగాయ్!

**-డిజిటల్ లావాదేవీలు మరింత ప్రోత్సాహం -యుపిఐలో డబ్బులు పంపితే ఛార్జీలు ఉండవు**

**ప్రభాతవార్త-తిరుపతి:**

సాంకేతికంగా వస్తున్న మార్పులకనుగుణంగా ప్రజల జీవనవిధానంలో కూడా అనేక రకాలుగా నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. ఒకప్పుడు పెద్ద మొత్తంలో డబ్బులు ఇంటి నుండి బయటకు తీసు కెళ్ళాలన్నా, బ్యాంకునుండి డ్రా చేసుకుని ఇంటికి చేరుకోవాలంటే నానా తంటాలు పడిన ప్రజలకు ఇప్పుడు సాంకేతికత అభివృద్ధితో చేతిలో ఉన్న సెల్‌ఫోన్(చరవాణి)ద్వారా వందలు,వేల రూపాయలే కాదు... ఏకంగా లక్షరూపాయల వరకు కూడా నగదు లావాదేవీలు జరుపుకునే సులభ విధానం అలవాటై పోయారు. చేతిలో మొబైల్‌ఫోన్ ఉంటేచాలు, ఎక్కడ చూసినా సులభంగా తమకు కావలసిన వస్తువులు కొనుగోలు చేయడం, కోరిన భోజనం ఆర్డర్ చేయడం, లేదా రుచికరంగా హోటల్‌లో తిని ఆ వెంటనే డబ్బులను డిజిటల్ లావాదేవీలు (యుపిఐ-ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎమ్) వంటి విధానాల్లో క్షణాల్లో చెల్లించి సులభంగా వెళ్ళిపోతున్నారు. ఇలా ఒకటేమిటి ఇప్పుడు దేశంలోని ఏ హిందూ ఆలయానికి వెళ్ళినా, చివరకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధార్మికసంస్థ, పుణ్యక్షేత్రం తిరుమల లోనూ గదులు బుకింగ్, దర్శన టిక్కెట్లు పొందడం, అలిపిరి టోల్‌గేట్‌లో టోల్‌ఫీజు చెల్లించడం వంటివి కూడా డిజిటల్ లావాదేవీలు ప్రారంభించేశారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా డిజిటల్ పేమెంట్స్ (యుపిఐ) విధానం అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పుడు గ్రామాల్లో



నివాసముంటున్న సామాన్య ప్రజలు, చివరకు రైతులు, మహిళలు కూడా చేతిలో ఉన్న సెల్‌ఫోన్‌తో ఫోన్‌పే పేమెంట్స్‌తో నగదు లావాదేవీలు జరిపేస్తున్నారు. ఇప్పుడు చిన్న వస్తువు కొనుక్కున్నా యుపిఐ విధానంలో చెల్లించేస్తున్నారు. ఓ వైపు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహిస్తుంటే మరోవైపు ప్రజలు చేసిన యుపిఐ చెల్లింపులకు ఛార్జీలు విధిస్తారని గత కొంతకాలంగా ప్రచారం మొదలైంది. గత ఆగస్టునుండి 2వేలు రూపాయలు పైన చేసిన యుపిఐ చెల్లింపులకు ఛార్జీలు వసూలుచేయనున్నారనే పుకార్లు మొదలయ్యాయి. దీంతో సామాన్యప్రజలు కూడా ఒకింత కలవరం మొదలైంది. కష్టపడి సంపాదించిన ఆదాయంగానీ, ఉద్యోగుల నెలవారీగా వేతనాలు వంటివి బ్యాంకులో డిపాజిట్ జరిగితే లావాదేవీలు యుపిఐ విధానం లోనే జరిపిస్తున్నారు. ఈ నేపధ్యంలో యాత్రాస్థలం తిరుపతి, తిరుమలలోనేగాక చిత్తూరు,తిరుపతి జిల్లాలోని ప్రజలు కూడా యుపిఐ చెల్లింపుల ఛార్జీలు భారం అంటూ కొద్దిరోజులుగా భయపడుతున్నారు. అయితే తాజాగా ఈ పుకార్లకు చెక్‌పెడుతూ పిఐబి వాస్తవాలను వెల్లడించింది. యుపిఐ చెల్లింపులకు ఛార్జీలు వసూలుచేస్తారనే ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెట్టింది. సాదారణ యుపిఐ నగదు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలు వసూలుచేయరని, డిజిటల్ వ్యాలెట్లైన్ల ప్రీపెయిడ్ పేమెంట్ ఇన్‌స్ట్రూమెంట్స్ పైనే ఛార్జీలు ఉంటాయని పేర్కొంది. అయితే దీనిపై సామాన్యప్రజలకు బ్యాంకులుగానీ, కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు మరింత అవగాహన కల్పిస్తేనే యుపిఐ డిజిటల్ పేమెంట్స్ ప్రోత్సాహం ఉంటుందని జనం చర్చించుకుంటున్నారు.

**భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించిన...**

# ఆలయ ఉద్యోగి సస్పెన్షన్

కాణిపాకం, డిసెంబర్ 16 ప్రభాతవార్త: భక్తుల పట్ల అమర్యాదగా ప్రవర్తించి ఆలయ ప్రతిష్టకు భంగం కలిగించిన ఆలయ ఉద్యోగిని సస్పెండ్ చేస్తూ ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా వున్నాయి. ఆదివారం కిషోర్‌గౌడ్ అనే భక్తుడు కాణిపాకం స్వామివారి దర్శనార్థం వచ్చారు. ఆలయ విఐపీ గేటు వద్ద దర్శనానికి టటిక్కెట్ కొనుగోలు చేశారు. భక్తునికి దర్శన టిక్కెట్ ఇవ్వాల్సిన టిక్కెట్ కౌంటర్‌లో పనిచేసే డైలీ వేజెస్ ఉద్యోగి జి.కుట్టిబాబు 500రూపాయల సాధారణ ఆశీర్వాదం టిక్కెట్‌ను మంజూరు చేశారు. ఈ టిక్కెట్‌లో ఇద్దరు భక్తులకు అనుమతి అని వున్నప్పటికి ఒక్కరిని అనుమతించడానికి 500రూపాయలు ఆశీర్వాదం టిక్కెట్ ఎలా ఇస్తారని భక్తుడు ఆలయ ఉద్యోగిని నిలదీశాడు. దీనితో కుట్టిబాబు భక్తునికి సరైన సమాధానం ఇవ్వకపోగా అతని పట్ల అమర్యాదగా ప్రవర్తించడంతో భక్తునికి, ఉద్యోగికి మధ్య ఘర్షణ నెలకొంది. దీనితో భక్తుడు కిషోర్ గౌడ్ ఆలయం వద్ద జరుగుతున్న దోపిడీపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఎక్స్ ట్విట్టర్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆలయ ఈఓ పెంచల కిషోర్ జరిగిన సంఘటనపై వెంటనే విచారణకు ఆదేశించారు. భక్తునికి దర్శన టిక్కెట్ వేరుగా ఇవ్వాల్సి వున్నప్పటికి దురుద్దేశపూర్వకంగా సాధారణ ఆశీర్వాదం టిక్కెట్ విక్రయించి భక్తులను దర్శనానికి పంపి వున్నట్లు గుర్తించి అధికారులు ఇచ్చిన నివేదిక అధారంగా కుట్టిబాబును అప్పటికప్పుడు విధుల నుండి తొలగిస్తూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

**మృతదేహం కోసం...**

# ఈతకొట్టుకుంటూ వెళ్ళిన సిఐ

**-వాలగల మందకాలువలో కిలోమీటరుపైగా వెళ్ళిన వైనం -విద్యార్థి మృతదేహం లభ్యం**



నీటిలో నుంచి తీసుకువస్తున్న సిఐ తిమ్మయ్య, గ్రామస్తులు



తొట్టంబేడు, డిసెంబర్ 16 ప్రభాతవార్త : మండలం లోని చోడవరం గ్రామ సమీపంలో ఉన్న వాలగల మంద కాలువలో ఆదివారం గుండేలిగుంట పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన సురేష్ కుమారుడు లక్ష్మీధర్ (14) తన నలుగురు స్నేహితులతో కలసి ఈతకు దిగారు. వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పాటు లక్ష్మీధర్‌కు ఈతరాకపోవడంతో వాగులో కొట్టుకుపోయాడు. దీంతో సమాచారం అందుకున్న సిఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్య, తల్లిదండ్రులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని ప్రత్యేక బోటులో సిబ్బందితో ఎంత గాలించినా ఆచూకి తెలియకపోవడంతో చీకటి పడడంతో వెనుదిరిగారు. దీంతో సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ సర్కిల్ సిఐ తిమ్మయ్య స్వయంగా రంగంలోకి దిగారు. యూనిఫాం షర్టుతీసి స్వయంగా నీటి ప్రవాహంలో సుమారు కిలోమీటరు పైగా ఈతకొట్టుకుంటూ బాలుడి మృతదేహంకోసం గాలించారు. దీంతో వాగులో నీటి ప్రవాహంలో ఓవైపు ముళ్ళపొదల మద్యలో బాలుడి మృతదేహం ఉండడంతో గురించి వాగునీటి ప్రవాహంలోనే దిగి బాలుడి మృతదేహాన్ని తీసుకువచ్చారు. దీంతో సిఐ సాహసానికి గ్రామస్తులు, ప్రజలు అభినందించారు. పోలీసులు కేవలం రక్షణకే కాదు..ఎలాంటి సాహసాలకైనా సిద్దంగా ఉంటారనడానికి తిమ్మయ్య నిదర్శనం. గత ఏడాది కూడా కారాకొల్లు వాగులో ఇద్దరు కొట్టుకుపోయి స్తంభాన్ని పట్టుకుని సాయం కోసం అరవగా అప్పటి ఎస్ఐ,సిబ్బందితో పాటు అగ్నిమాపకశాఖ అధికారులు సాహసించి వారిని కాపాడిన విషయం విదితమే. సోమవారం బాలుడి మృతదేహాన్ని ఎట్టకేలకు గట్టుపైకి తెచ్చి తల్లిదండ్రులకు చూపించిన అనంతరం బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**జిల్లా అధికారుల్లో...**

# చలనం ఎక్కడ!

**- కలెక్టరేట్‌కు పెరుగుతున్న అర్జీదారుల గోల...! - సమస్యలకు ప్రత్యామ్నాయం చూపండి - జిల్లా అధికారులకు కలెక్టర్ సూచన**

తిరుపతి కలెక్టరేట్, డిసెంబర్ 16 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెద్ద సంఖ్యలో అర్జీదారులు క్యూ కడుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతున్న ఈ కార్యక్రమానికి రోజురోజుకు కాలం పెరుగుతూ వస్తోంది. దీనికి ప్రధాన కారణం జిల్లా పరిధిలోని గ్రామ మండల రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని, అలాగే ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వెనుకంజ వేస్తున్నారని చెప్పక తప్పదు. దీంతో జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులపై ఒకానొక దశలో ఆగ్రహం వ్యక్తం చేసిన మరో మారు సంబంధిత అధికారుల దృష్టికి ప్రజా సమస్యలను వచ్చిన వెంటనే ఆ సమస్య పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఫిర్యాదు దారుడికి తెలియ జేయాలి. లేనిపక్షంలో ఫిర్యాదుదారునికి సమస్య ఏ దశలో ఉంది. పరిష్కారం అవుతుందా...? కాదా అనేది తెలియజేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఎంతైనా ఉంది. అయితే అందుకు సంబంధిత అధికారులు సిబ్బంది ప్రజా సమస్యలను పరిష్కరించడంలో వెనుకంజ వేయడంతో కలెక్టరేట్టు ఫిర్యాదుదారులు పరుగులు తీస్తున్నారు. దీనిపై జిల్లా పరిధిలోని ఆయా విభాగాల సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆ సమస్య పరిష్కారానికి అవసరమైన కాలాన్ని చెప్పాలని పూర్తిస్థాయిలో ఈ సమస్య పరిష్కారానికి సాధ్యం కాదని అర్జీదారులకి వెంటనే ప్రత్యామ్నాయం చూపాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని తిరుపతి జిల్లా పరిధిలోని అన్ని విభాగాల సంబంధిత అధికారులకు సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సున్నితంగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం కొసమెరుపు. ఇకనైనా కలెక్టరేట్‌కు బారుల సంఖ్యలో అర్జీదారులు క్యూ కట్టకుండా ఎక్కడికక్కడే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సూచించడం విశేషం.



ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

# ప్రశ్నాపత్రం లీక్ దెబ్బ

**- 6-10 తరగతులకు మాథ్స్ సమ్మేటివ్-1 పరీక్ష వాయిదా**

చిత్తూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: పెద్ద పోటీ పరీక్షలు, పబ్లిక్ పరీక్షలకు మాత్రమే ఇప్పటి వరకు వున్న ప్రశ్నాపత్రాలు లీక్ జబ్బు ప్రస్తుతం పాఠశాల స్థాయి పరీక్షలకు అంటుకొంది. రాష్ట్ర వ్యాప్తంగా మాథ్స్ సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షా పత్రం లీక్ కావడంతో సోమవారం నిర్వహించాల్సిన మాథ్స్ సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షను ప్రభుత్వం వాయిదా వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 11వ తేదీ నుండి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాక షెడ్యూల్ జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో సైతం ఈ నెల 11వ తేదీ నుండి సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ మాథ్స్-1 పరీక్ష నిర్వహించాల్సి వుంది. తమను పెద్దగా ప్రభావితం పరీక్ష కానప్పటికి పాఠశాల స్థాయి విద్యార్థులు మాత్రం ఇళ్ళ వద్ద మాథ్స్ సమ్మేటివ్-1 పరీక్షకు సిద్దమై వచ్చారు. విద్యార్థులు పాఠశాలకు చేరుకుని సమ్మేటివ్ అసెస్‌మెంట్ మాథ్స్-1 పరీక్ష నిర్వహించడానికి ఉపాధ్యాయులు ఇస్తారని టెన్షన్‌తో ఎదురు చూస్తున్న తరుణంలో ప్రభుత్వం సోమవారం నిర్వహించాల్సిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ మాథ్స్-1 పరీక్షను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం జరుగాల్సిన మాథ్స్ సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఆదివారం సాయంత్రానికే గుగూల్‌లో ప్రత్యక్షం కావడం, ఆపై స్థానికంగా నెట్ సెంటర్లు, యూ ట్యూబ్‌ల్లో పరీక్షల ప్రశ్నాపత్రాలు కన్పించడం ప్రారంభించడంతో స్పందించిన విద్యాశాఖ ఈ పరీక్షను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.

# స్టేడియం పనులు వేగవంతం చేయాలి

**- శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీని సందర్శించిన శాప్ ఛైర్మన్ - ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పరిశీలన - స్టేడియం అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష**

తిరుపతి, డిసెంబర్ 16 ప్రభాతవార్త : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలని, సకాలంలో పూర్తిచేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ, శాప్ నిధులతో చేపడుతున్న ఇండోర్ స్టేడియం పనులను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఉమా, రిజిస్ట్రార్ ఎన్.రజనీ, పీఈడీ ఎస్.సరోజినీ, డీస్డీఓ సయ్యద్ సాహెబ్‌లతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. నత్తనడకన సాగుతున్న స్టేడియం నిర్మాణం పట్ల అసహనం వ్యక్తం చేశారు. స్టేడియం నిర్మాణానికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంతో కాంట్రాక్టర్ పనితీరుపై అసంతృప్తి చెందారు. అనంతరం వీసీ ఛాంబర్‌లో స్టేడియం పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ స్టేడియం నిర్మాణానికి సంబంధించి పూర్తిస్థాయిలో నిధులు మంజూరైనా నేటికీ పనులు పూర్తికాకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుం దన్నారు. నిర్మాణాన్ని ఎప్పటిలోపు పూర్తిచేస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. అలాగే స్టేడియంలో వీక్షకులకు కనీస సౌకర్యాలు లేవని, వీక్షకులకు గ్యాలరీని ఏర్పాటు చేయాలని అన్నారు. దానికి సంబంధించిన అంచనాలను రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉడెన్ కోర్టును త్వరితగతిన పూర్తిచేయాలని, అలాగే ఖోఖో కోర్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తద్వారా భవిష్యత్తులో వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడలను కూడా నిర్వహించేందుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే లైటింగ్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరిచూసు కోవాలని, కాంట్రాక్టర్ అందుబాటులో లేకుంటే మళ్ళీ ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. దీనిపై క్రీడాశాఖ మంత్రివర్యులు కూడా దృష్టి సారిస్తున్నారని, ప్రారంభోత్స వానికి సిద్ధం చేయాలని ఇప్పటికే మాకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఎప్పటిలోపు స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేస్తారనేది మాకు స్పష్టంగా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేశ్ యాదవ్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగుయువత రాష్ట్ర నాయకులు రంజిత్, ఇంజినీరింగ్ అధికారులు, శాప్ కోచ్‌లు పాల్గొన్నారు.





**మెగా కంపెనీ నిర్వాకంతో...**

# నీట మునిగిన పొలాలు

**-మండల సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ధ్వజం**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ

తొట్టంబేడు, డిసెంబర్ 16 ప్రభాతవార్త : మెగా కంపెనీ నిర్వాకంతోనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువయ్యాయని, సమీపంలో పొయ్య గ్రామం నుంచి లింగమ నాయుడు గ్రామం వరకు చెంబేడు కాలువను పూడ్చివేయడంతోనే వరదల సమయంలో సుమారు 300 ఎకరాలు నీటిలో వరిపంట నీటమునిగాయని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ధ్వజమెత్తారు. అంతేకాకుండా హైవేలో ఏగ్రామం ఎక్కడ ఉందో కనీసం బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని దీంతో ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడడంతోపాటు ఈమార్గంలో వాహనాలు అధికవేగంతో వెళ్తుండడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని ఎంపిపి ఉన్నం నిర్మల మెగా కంపెనీ అధికారులపై ధ్వజమెత్తారు. సోమవారం తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉన్నం నిర్మలవాసుదేవనాయుడు ఆధ్వర్యం లో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపిడిఓ సురేంద్రనాథ్ అధ్యక్షత వహించగా వైస్ ఎంపిపిలు కన్నలిమల్లికమ్మ, గరటారెడ్డిలు హాజర య్యారు. సమావేశంలో తొలుత సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ గౌరీజోష్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజిఎస్ నుంచి రోడ్డుపనులు మంజూరయ్యాయని వివరించారు. ఇక అంగన్‌వాడీ పాఠశాలల్లో నీటి సమస్యను తీర్చుతామన్నారు. ఏఓ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో 4400 హెక్టార్లలో వరి పంట వేయాల్సి ఉండగా వర్షాలకు సుమారు వెయ్యి ఎకరాల్లో నీటమునిగిందని, పంటచేనుల్లో నీటి ప్రవాహం తగ్గాక పంటనష్టాన్ని అంచనావేస్తామన్నారు. ఉపాధిహామీ పథకంలో 1.94లక్షలు పనిదినాలు పూర్తిచేశామని రూ.6.53 కోట్లు ఖర్చు చేశామన్నారు. అంతేకాకుండా 23రకాల పండ్ల చెట్లను సబ్సిడీలో ప్రభుత్వం అందిస్తోందని వీటిని కూడా ప్రత్యామ్నాయ పంటలు కూడా వేయాలని ఎపిఓ సుజాత తెలిపారు. విద్యాశాఖ నుంచి ఎంఈఓ 2 భాస్కర్ మాట్లాడుతూ ఒకే దేశం.. ఒకే విద్యార్థి అన్న నినాదంతో ఆపార్డ్‌ను ఏర్పాటు చేసిందని ఇప్పటికే మండలంలో 76శాతం పాఠశాలల్లో పూర్తిచేశామన్నారు. డిప్యూటీ తహశీల్దార్ జగన్‌మోహన్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులకు సర్పంచ్‌లు మాత్రమేనా ఎంపిటిసిలు కనిపించలేదా అసలు కార్యక్రమాలు ఏవీ ప్రజాప్రతినిధులకు తెలియజేయడం లేదని ధ్వజమెత్తారు. విద్యుత్‌శాఖ ఎఈ బాలాజీ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ సబ్సిడీలో తీసుకోవచ్చు న్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలకు పలు ప్రాంతాల్లోని పంటపొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. వెలుగు ఎంపిఎం ఇందిర మాట్లాడుతూ ప్రభుత్వం సక్షర వికాస్ కార్యక్రమం ఏర్పాటు చేసిందని ఇందులో 11 నుంచి 18వరకు మహిళలును గ్రూపులుగా ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా నిరక్షరాస్యు లను ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వారికి విద్యనేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు మండలాధికారులుతో పాటు, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వరుస వానలొస్తే...ఘాట్‌లో బండరాళ్ళ భయం !

**ప్రభాతవార్త ప్రతినిధి-తిరుమల:**

ఎడతెరపి లేకుండా వరుసగా రెండు మూడురోజులు జోరువానలు కురిస్తే తిరుమల కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందనే భయం అటు టిటిడి అధికారుల్లో ఇటు భక్తుల్లో నెలకొంది. ఎక్కడ నుండి ఎప్పుడు ఎలా బండరాళ్ళు జారుతాయనేది కూడా అంచనా వేయలేని పరిస్థితి. ఇప్పటివరకు దేవదేవుడు ఆశీస్సులతో కొండల్లోంచి పెద్ద బండరాళ్ళు జారిపడినా ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడం దేవుని దయేనని భక్తుల విశ్వాసం. వరుసగా మూడురోజులు వానొస్తే ఘాట్‌లో ప్రయాణం చేయాలంటే వాహనదారులకు, భక్తులకు భయం వీడటం లేదు. ఇప్పుడు వర్షాకాలం ఆరంభమవడం... ఆపైన బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో వరుసగా జోరు వానలు కురుస్తున్నాయి. గతంలో వరుసగా కురిసిన భారీ వర్షాలకు తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండో ఘాట్ లో భారీగా బండరాళ్ళు జారిపడిన విషయం విదితమే. ముందుగానే అప్రమత్తంగా వ్యవహరించిన టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఇంజనీరింగ్ అధికారులు. అటవీఅధికారులు ఎప్పటికప్పుడు జారిపడిన మట్టి, బండరాళ్ళను తొలగించారు. ఇలాంటి సందర్భాలు నాలుగురోజులు వర్షాలు కురిస్తే ఎదుర్కోక తప్పడం లేదు. గత వారంలో రెండు రోజుల జోరువానలకు కొండల్లోంచి బండ రాళ్ళు జారిపడ్డాయి. తిరుమలకు చేరుకునే రెండోఘాట్ ప్రమాదకరమని, ఈ మార్గంలో కొన్నిచోట్ల మట్టిజారిపడి బండరాళ్ళు పడేప్రమాదం లేకపోలేదని దశాబ్ద కాలం క్రిందటే ఐఐటి నిపుణులు, ఇంజనీరింగ్ నిపుణులు హెచ్చరించారు. ఇందుకు ప్రత్యామ్నాయం సూచించినా కొంతవరకే పనులు చేపట్టారు. గత ఏడాది కూడా రెండోఘాట్‌లో దాదాపు కొండల్లోంచి బండరాళ్ళు జారిపడే ప్రమాదం ఉందని గుర్తించిన ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అధికారులు గోడలను ఎత్తు పెంచడం, ఇనుప కంచెగ్రిల్స్ వేయడం చేశారు. అయినా కొండల్లో ఎక్కడ బండరాళ్ళు జారుతాయనేది నిర్దిష్టంగా గుర్తించలేకపోతున్నారు. రెండోఘాట్‌లో అలిపిరి వినాయక స్వామి గుడి దాటిన తరువాత లింకురోడ్డు మధ్య వరకు కొండచరియలు విరిగి పడే ప్రాంతాలను సూచాయప్రాయంగా గుర్తించిన ఇంజనీరింగ్ అధికారులు అందుకు తగ్గట్లు దాదాపు 15కిపైగా అటవీప్రాంతంలో పనులు మొదలుపెట్టారు. ఇవి ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఘాట్‌లో భక్తుల భద్రతపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఘాట్‌లో కొండచరియలు విరిగి పడే ప్రమాదం ఉన్న చోట్ల అనుసరించాల్సిన జాగ్రత్తలపై టిటిడి అధికారులు ముందు చూపుతోనే జాగ్రత్తపడుతున్నారు. అయితే వరుసగా రెండుమూడు రోజులు బలమైన వర్షాలు వస్తే పరిస్థితిని అంచనా వేయలేకపోతుండటం కొసమెరుపు.

# బాధ్యతతోనే సమస్యల పరిష్కారం

**- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

చిత్తూరు, డిసెంబర్ 16 ప్రభాతవార్త: ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలను బాధ్యతతో ప్రత్యేక శ్రద్ధ కేంద్రీకరించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని నూతన సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు కలెక్టర్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొని ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీకి ఆడిటింగ్ జరుగుతుందని, సమస్యలు త్వరితంగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను పరిష్కరించడంతో క్షేత్ర స్థాయి సిబ్బందిని సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీల పరిష్కార ప్రగతిని ప్రతి వారం సమీక్షించడం జరుగుతుందన్నారు. అర్జీలు రీ-ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల న్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 185 సమస్యలు**

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని నూతన గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల ప్రజల నుండి సమస్యలపై 185 అర్జీలు అందాయి. ప్రజల నుండి సమస్యలపై అందిన ప్రతి అర్జీని పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్, ర్డీఓ శ్రీనివాసులులు క్షేత్ర స్థాయికి వెళ్ళి సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజల నుండి 161 సమస్యలు అందాయి.

